సాక్షి
పశ్చిమగోదావరి
7
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

దీపావళి శుభాకాంక్షలు

కలెక్టర్ నాగరాణి



భీమవరం (ప్రకాశంచౌక్): దీప కాంతులతో శోభాయమానంగా, సంప్రదాయబద్ధంగా దీపావళి పండగ జరుపుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటామన్నారు. వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని సూచించారు.

భక్తుల రద్దీ సాధారణం



అనివేటి మండపంలో భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో **ఆదివారం** భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. **సెలవు రోజు** కావడంతో ప్రతి వారం వేలాది **మంది భక్తులు** చినవెంకన్నను దర్శిస్తారు. అయి**తే దీపావళి** పండగ ముందురోజు, అందు**లోనూ సోమ**వారం అమావాస్య కావడంతో **భక్తులు నామ**మాత్రంగా ఆలయానికి విచ్చేశారు. **దీంతో** దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట ఇలా అన్ని విభాగాల్లో భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. సోమవారం సైతం క్షేత్రంలో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది.

విద్యుత్ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దీపావళి పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశామని ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్‌ఈ పి.సాల్మన్ రాజు ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో టోల్‌ఫ్రీ నం.1912, సెల్ 9440902926, ఏలూరు డివిజన్‌లో సెల్ 9440904037, జంగారెడ్డిగూడెంలో సెల్ 9491030712 నంబర్‌తో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సరఫరా, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవిస్తే ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు సెల్ 9440812702, 9440812703, 9440812704, 9491049797 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

సాయంకాలార్చన సమయంలో మార్పు



ద్వారకాతిరుమల : వృశ్చిక సంక్రమణం (శీతాకాలం) ప్రారంభం కావడంతో ద్వారకాతిరుమల శ్రీవారి సాయంకాలార్చన సమయాన్ని ఈనెల 23 నుంచి మార్పు చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆదివారం ప్రకటలో తెలిపారు. సాధారణంగా రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు సాయంకాలార్చన నిర్వహిస్తారు. అయితే శీతాకాలం కారణంగా ఈ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటలకు మార్పు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు. మేష సంక్రమణ వరకు ఈ సమయం కొనసాగుతుందని చెప్పారు.

బాధిత బాలిక వివరాల సేకరణ

మేనమామ వేధింపులపై విచారణ

కైకలూరు: మేనమామ వేధింపులు, తల్లి, అమ్మమ్మ, తాత చితకబాదిన ఘటనలో బాధిత బాలిక నుంచి కైకలూరు రూరల్ పోలీసులు ఆదివారం వివరాలు సేకరించారు. కైకలూరు మండలం చటాకాయి గ్రామానికి చెందిన జయమంగళ కుమార అభిమన్యు మొదటి భార్య కుమార్తె (14)ను ఆమె తల్లి కామాక్షి గతనెల 26న వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు మండలం అల్లూరి పంచాయతీ అగ్రహారం తీసుకువెళ్లారు. అక్కడ బాలికను తల్లి, అమ్మమ్మ, తాత విపరీతంగా కొట్టడంతో పాటు తండ్రి వద్దకు పంపాలంటే మేనమామ ఉమాశంకర్ లైంగిక కోరిక తీర్చాలని బలవంతం చేశాడని బాలిక పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో కైకలూరులో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు బాలిక తల్లి కామాక్షి, అమ్మమ్మ మోరు నాగులమ్మ, తాత వెంకటరమణ, మేనమామ ఉమాశంకర్‌లను దోషులుగా చేర్చి రిపోర్టును పంపారు. బాలిక మైనర్ కావడంతో పోక్సో కేసు నమోదు చేసే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలను బద్వేలు పంపారు. అక్కడ పూర్తి విచారణ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని పోలీసులు చెప్పారు.







దేదీప్యమానం

- దీపం.. బహురూపం
- కొంగొత్త ఆకృతుల్లో ప్రమిదలు

'దీపోజ్యోతిః పరం బ్రహ్మ, దీపః సర్వ తమో పహః'.. దీపం జ్యోతి స్వరూపం, అదే పరబ్రహ్మం, దీపం చీకటని పారద్రోలుతుందని దీనర్థం. అజ్ఞానమనే చీకటిని పోగొట్టి జ్ఞానమనే కాంతిని ప్రసరింపజేసే దీపాల అలంకరణే దీపావళిలో ప్రధాన భూమిక. ఒకప్పుడు మట్టితో చేసిన ప్రమిదల్లో నూనె పోసి దీపాలు వెలిగించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విభిన్న ప్రమిదలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. సరికొత్తగా ఆకట్టుకుంటున్నాయి. ఎర్రమట్టి, పింగాణి తదితర వాటితో చేసిన ఈ ప్రమిదలను వ్యాపారులు తమిళనాడు, రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దేవతామూర్తులు, మహిళలు దీపాలు పట్టుకున్నట్టు, కలశం, శంఖుచక్రం, తులసికోట, కిరోసిన్ బుడ్డిలుగా రకరకాల థీముల్లో లభ్యమవుతున్నాయి. మరోపక్క విద్యుత్‌తో వెలిగే దీపాలూ ఆకట్టుకుంటున్నాయి. ఆయా ఆకృతులను బట్టి రూ.50 నుంచి రూ.400 వరకూ ప్రమిదలను విక్రయిస్తున్నారు. దీపావళికి వారం రోజుల ముందు నుంచే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పట్టణాలతో పాటు గ్రామాల్లో వందలాది దుకాణాలు ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరూ రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

– సాక్షి, భీమవరం

కార్తీకం.. శివోహం

- 23 నుంచి కార్తీక మాసోత్సవాలు
- జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ
- పంచారామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- వేలాది మంది భక్తుల రాక

భీమవరం(ప్రకాశం చౌక్): పరమ పవిత్రమైన కార్తీక మాసోత్సవాలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 23 నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. జిల్లాలో దేవదాయశాఖ నిర్వహణలో 30కు పైగా ప్రసిద్ధి శివాలయాలు ఉన్నాయి. ఆలయ కమిటీల ద్వారా నిర్వహించే శివాలయాలు మరో 15 వరకు ఉంటాయి. ముఖ్యంగా జిల్లాలో భీమవరం, పాలకొల్లులో పంచారామ క్షేత్రాలకు ఏటా కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు వస్తుంటారు.

ప్రత్యేక పూజలు.. విశేష అలంకరణలు

నెల రోజులపాటు పంచారామ క్షేత్రాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేస్తుంటారు. అలాగే ప్రత్యేక అభిషేకాలు, కార్తీక దీపారాధనలు జరుగుతుంటాయి. రాత్రిళ్లు విద్యుత్ కాంతులతో క్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతాయి.

శక్తీశ్వరస్వామి ప్రత్యేకం

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భీమవరం మండలం యనమదుర్రులో పార్వతీ సమేత శక్తీశ్వరస్వామి ఆలయంలో స్వామివారు తలకిందులుగా దర్శనమిస్తారు. పార్వతీమాత బాలింతగా, కుమారస్వామి వారి ఒడితో పెట్టుకుని ఒకే పీఠంపై దర్శనమిస్తారు. ఈ ఆలయానికీ వేలాదిగా భక్తులు తరలివస్తారు. భీమవరం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది.

మరిన్ని ప్రసిద్ధి ఆలయాలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మరిన్ని ప్రసిద్ధి శివాలయాలు ఉన్నాయి. భీమవరంలో భీమేశ్వరస్వామి వారు, ఆచంటలో ఆచంటేశ్వరస్వామి, నత్తారామేశ్వరంలో రామేశ్వరస్వామివారు, జుత్తిగలో ఉమా సోమేశ్వరస్వామివారు, లక్ష్మణేశ్వరంలో దుర్గా లక్ష్మణేశ్వరస్వామి, వీరవాసరంలో వీరేశ్వరస్వామి, కొడమంచిలిలో సర్వేశ్వరస్వామి, శివదేవుని చిక్కాలలో శివదేవస్వామి, సజ్జాపురంలో సోమేశ్వరస్వామి, పెనుగొండలో నగరేశ్వరస్వామి, ఎన్నార్పీ అగ్రహారంలో విశ్వేశ్వరస్వామి, ఉండిలో మల్లేశ్వరస్వామి, ఆకివీడులో భీమేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, వేంద్ర అగ్రహారంలో రామలింగేశ్వరస్వామి, అండలూరులో మల్లేశ్వరస్వామి, నవుడూరులో రామలింగేశ్వరస్వామి, విస్సాకోడేరులో సోమేశ్వరస్వామి, తాడేరులో రామలింగేశ్వరస్వామి, తుందుర్రులో సోమేశ్వరస్వామి ఇలా పలు శివాలయాలు కార్తీక మాసోత్సవాలకు ముస్తాబవుతున్నాయి.





భీమవరంలో ఉమాసోమేశ్వరస్వామి



పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరస్వామి



భీమవరంలో కార్తీకమాస ఏర్పాట్లు

భీమవరంలో కాంతులీనుతున్న ఉమాసోమేశ్వర, జనార్దనస్వామి ఆలయం (ఫైల్)

పంచారామం.. మోక్షధామం

జిల్లాలో రెండు పంచారామ క్షేత్రాలు ఉన్నాయి. భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానం (సోమారామం), పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వరస్వామి దేవస్థానం (క్షీరారామం)గా కీర్తిగడించాయి. భీమవరం పంచారామక్షేత్రంలో ఉమాసోమేశ్వరుడు చంద్రుడి ప్రతిష్ఠాపన కావడంతో శివలింగం అమావాస్యకు గోధుమ వర్ణంలో, పౌర్ణమి నాడు శ్వేతవర్ణంలోకి మారడం ఇక్కడ ప్రత్యేకం. కార్తీకమాసం నెల రోజులపాటు ఈ రెండు క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగుతాయి. దేశంలోని నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యంగా సోమవారం రోజుల్లో 70 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు.

కార్తీకం.. పవిత్ర మాసం



కార్తీకం ఎంతో పవిత్రమైన మాసం. శైవక్షేత్రాలను సందర్శించి పరమేశ్వరుడికి పూజలు చేయడంతో పాటు నిత్య దీపారాధన చేయాలి. పరమేశ్వరుడికి అభిషేకాలు చేయడం ద్వారా విశేష ఫలితం దక్కుతుంది. నవ వధువులు కార్తీక పౌర్ణమి నాడు ఉపవాసం ఉండి కార్తీక నోములు నోచుకుంటారు. దీపదానం, వస్త్రదానం, వెండి ఆవు, వెండి దూడ దానం, ఉసిరి దానం విశిష్టమైనవి. కాలువల్లో అరటి తెప్పలో దీపాలు పెట్టి వదలడం పుణ్యఫలం.

– అకొండి రాంబాబు, అర్చకులు, గునుపూడి

కార్తీకమాస ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ త్రినాథరావు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం ఉమా సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంలో కార్తీకమాస ఏర్పాట్లను దేవదాయశాఖ ఆర్‌జేసీ వేంద్ర త్రినాథరావు ఆదివారం పరిశీలించారు. దేవస్థానంలో క్యూలైన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 నుంచి ప్రారంభ కానున్న కార్తీక మాసోత్సవాలకు వేలాది మంది భక్తులు రానున్న దృష్ట్యా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈవోకు సూచించారు. భక్తులకు టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. దేవస్థానం చైర్మన్ చింతలపాటి బంగారురాజు, ఈఓ డి.రామకృష్ణంరాజు, సిబ్బంది ఉన్నారు.

21.7 మి.మీ. సగటు వర్షపాతం

భీమవరం: అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ 21.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా తాడేపల్లిగూడెంలో అధికంగా 42.4 మి.మీ., పెంటపాడులో 16.8, తణుకులో 10.4, అత్తిలిలో 22.6, గణపవరంలో 32.4, ఆకివీడులో 25.6, ఉండిలో 22.6, పాలకోడేరులో 37.2, పెనుమంట్రలో 35.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇరగవరంలో 12.2, పెనుగొండలో 6.8, ఆచంటలో 10.4, పోడూరులో 19.4, వీరవాసరంలో 23.2, భీమవరంలో 10.6, కాళ్లలో 26.8, మొగల్తూరులో 25.4, నరసాపురంలో 16.2, పాలకొల్లులో 17, యలమంచిలిలో 20.2 మి.మీ.. మొత్తంగా 433.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

దళిత బాలుడిపై దాడి



వేగవరంలో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న యువకులు

- ప్రాణాప్రాయ స్థితిలో చికిత్స పొందుతున్న వైనం
- ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన



విజయవాడలో చికిత్స పొందుతున్న చైతన్య

జంగారెడ్డిగూడెం: మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి, దళిత బాలుడు చైతన్య విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. కొందరు యువకులు విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న వేగవరంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఊరేగింపులో డీజే చూసేందుకు చైతన్య వెళ్లాడు. అయితే ఓ వ్యక్తి ప్రోద్బలంతో కొందరు నిర్వాహక యువకులు నువ్వెందుకు వచ్చావంటూ బాలుడిని ప్రశ్నిస్తూ, కులం పేరుతో దూషించి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి విజయవాడ రిఫర్ చేశారు. విచక్షణారహితంగా కడుపులో కాలుతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడంతో బాలుడి ప్యాంక్రియాస్‌కు తీవ్ర గాయమైంది. ప్యాంక్రియాటిక్ ట్యూబ్ చీలడంతో రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితిలో బాలుడు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడి నుంచి బాలుడిని గుంటూరు ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసినట్టు సమాచారం. కాగా బాలుడిపై దాడి చేసిన యువకులంతా జనసేన పార్టీకి చెందిన వారుగా తెలిసింది. ఇదిలా ఉండగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాలుడికి న్యాయం చేయాలంటూ దళిత సంఘాలు పెద్దెత్తున డిమాండ్ చేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం దళితులు వేగవరం జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి ఆందోళన నిర్వహించారు.

అదే రోజు మరిన్ని గొడవలు

ఈనెల 5న శరన్నవరాత్రుల ముగింపు ఉత్సవాలు సమయంలో యువకుల తీరుతో మరో గొడవ జరగడంతో పెద్దలు సర్దుబాటు చేశారు. అలాగే తూర్పు, పడమరపేటలో వేర్వేరు ఉత్సవాల సందర్భంగా ఇరువర్గాల వారు మద్యం సేవించి గొడవలు పడినట్టు తెలిసింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం



లంకలకోడేరులో కోటి సంతకాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే కూటమి ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని లంకలకోడేరులో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల పోస్టర్లను ఆవిష్కరించి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాలకు వైద్య విద్యను దూరం చేసి పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేసి లబ్ధి పొందాలనే దురుద్దేశంతో చంద్రబాబు కూటమి ప్రభుత్వం నిరంకుశత్వ పాలన కొనసాగిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణపై పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా ఈ పోరాటంలో భాగం కావాలని కోరారు. సంతకాలు చేయడం ద్వారా నిరసన తెలపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నడపన గోవిందరాజులు నాయుడు, చెల్లెం ఆనందప్రకాష్, యడ్ల తాతాజీ, పెన్మెత్స ఏసురాజు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎర్రకాలువ వరద తగ్గుముఖం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జల్లేరు జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం ఎర్రకాలువ జలాశయం డీఈ సునీత, ఏఈ రాహుల్ సిబ్బందితో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. ఆదివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 82.79 మీటర్ల వద్ద ఉందని, పూర్తిస్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు అని తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1,875 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 2,274 క్యూసెక్కులుగా ఉందని తెలియజేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస డాంగే

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఉద్యోగ, సిబ్బంది సమస్యల పరిష్కారానికి వచ్చేనెల 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను, అలాగే ఈనెల 22న ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె తలపెట్టామన్నారు. ఆదివారం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు పూర్తయినా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, బకాయిపడిన డీఏలను తక్షణం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ పేమెంట్స్‌ను చెల్లించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరుణించు మంగమ్మ తల్లీ



మంగమ్మతల్లి గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ నిషేధంపై ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చే భక్తులు ఎవరూ ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా చర్యలు చేపట్టారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: అధిక కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు వేధిస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మండలంలోని వాడవల్లికి చెందిన అచ్యుత సంధ్యకు సీతారామపురానికి చెందిన యర్రంశెట్టి రమేష్‌తో ఏడాది కిందట వివాహం జరిగింది. వివాహానంతరం ప్రతీరోజూ భర్తతో పాటు అత్తమామలు వేధిస్తున్నారు. కొంతకాలం కిందట భర్త, అత్తమామలు సంధ్యను ఇంటి నుంచి గెంటేయగా పుట్టింట్లోనే ఉంటోంది. ఇటీవల పుట్టింటికి వెళ్లి వీరు గొడవపడ్డారని సంధ్య ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులను అరికట్టి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తణుకులో గంజాయి కలకలం

- ఎక్సైజ్ దాడులతో వెలుగులోకి
- యువతే లక్ష్యంగా గంజాయి విక్రయాలు



గంజాయి తరలిస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది(ఫైల్)



యువకుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి మూటలు(ఫైల్)

తణుకు అర్బన్: తణుకు ప్రాంతంలో తెరవెనుక విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు ఆందోళన కలిగిస్తోంది. గంజాయి విక్రయాలు, కొనుగోళ్లకు తణుకు ప్రాంతం అడ్డాగా మారిందనడానికి ఇటీవల తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు తనిఖీల్లో పట్టుబడ్డ గంజాయి ఉదాహరణ. ఈ నెల 12న తణుకు–ఉండ్రాజవరం జంక్షన్‌లో ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడుల్లో ద్విచక్ర వాహనంపై రూ.15 వేల విలువైన 5 కిలోల గంజాయి తరలిస్తూ ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. అందులో ఒకరు తప్పించుకున్నారు. ఈ ముగ్గురు యువకులు తణుకు మండలం మండపాక, పైడిపర్రుకు చెందిన వారిగా ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. దీంతో పైడిపర్రు ప్రాంతం గంజాయి విక్రయాలకు అనువుగా ఉందని, విక్రయించే వారు సైతం ఇక్కడే తిష్టవేశారని తెలుస్తోంది. తణుకు ఉండ్రాజవరం రోడ్డులోని శ్మశాన వాటికలో గంజాయిని నిల్వ చేసి విక్రయాలు చేస్తున్నారనే కచ్చితమైన సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు.

తణుకులో సంచలన ఘటనలు

గత నెలలో తణుకులో జరిగి భారీ చోరీలో 70 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. తాడేపల్లిగూడెంకు చెందిన యువకుడిని తణుకులో హత్య చేయడం వంటి ఘటనలు సంచలనం రేకెత్తించగా తాజాగా గంజాయి వ్యవహారం బయటపడడంతో తణుకులో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ప్రశాంతతకు మారుపేరుగా ఉండే తణుకులో ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ఘటనలతో తణుకు వాసులు బెంబేలెత్తిపోతున్నారు. 5 కిలోల గంజాయిని ద్విచక్ర వాహనంపై సాధారణంగా తరలించుకుపోవడం చూస్తుంటే తణుకులో గంజాయి వినియోగం ఏ స్థాయిలో ఉందోనని భయపడుతున్నారు. యువతకు అంగట్లో దొరికే ఒక సాధారణ వస్తువు మాదిరిగా గంజాయి తణుకులో అందుబాటులో ఉందనే అనుమానాలు ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి.

అనుమానిత ప్రాంతాలపై నిఘా

తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సంతమార్కెట్, టీటీడీ కల్యాణ మండపం, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో గంజాయి వాడకం, విక్రయాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. తణుకులో శ్మశాన వాటికల్లో గంజాయిని దాచిపెడుతున్నారనే విషయం ఇటీవల నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో బహిర్గతమైంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయిని రోడ్డు మీదే కొందరు అలవాటుపడ్డ వ్యక్తులు దమ్ములాగుతూ కనిపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి మార్కెట్‌లో విక్రయాలు జరుపుతున్నారని సమాచారం. గంజాయి తరలిస్తూ పట్టుబడిన పైడిపర్రుకు చెందిన యువకుడు ప్రస్తుతం పరారీలో ఉండగా, అతనిపై పలు ప్రాంతాల్లో 5 కేసులు ఉన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. పోలీసులు గట్టిగా దృష్టిపెడితే గంజాయి అమ్మకాలను నిరోధించే పరిస్థితులు ఉంటాయని, ఇటీవల కాలంలో పోలీసులకు బందోబస్తులు, సమావేశాల్లో పాల్గొనేందుకే సమయం కేటాయించలేని పరిస్థితి. ఇక గంజాయి తదితర వ్యవహారాలపై దృష్టిసారించే సమయం లేదనేది వాస్తవంగా కనిపిస్తోంది. ఇటీవల యువత అధికంగా గంజాయికి అలవాటు పడి విక్రయించే వారికోసం ఎదురుచూపులు చూసే పరిస్థితి తణుకులో నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయి మత్తులో యువత నేరాలకు పాల్పడుతున్నారని, ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్‌కు దిగుతున్నట్లుగా తెలుస్తోంది. గంజాయి విక్రయాలను అరికట్టాలని, పోలీసులు, నేర విభాగం నిఘా పెట్టి గంజాయి విక్రయాలకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

పెనుగొండ: దొంగరావి పాలెం గోదావరి బ్రిడ్జివద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధర్ తెలిపారు. ఆదివారం దొంగరావిపాలెం వీఆర్వో గాదంశెట్టి నాగేశ్వరి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వయసు 40–50 ఏళ్ల మధ్య ఉంటుందని, పసుపు పచ్చని డిజైన్ చీర ధరించి ఉందన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన వివాహిత ఇంటినుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఏలూరు టూటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తంగెళ్ళమూడి రాణినగర్ ప్రాంతానికి చెందిన కసిరెడ్డి నాగడింభకేసు, హర్షప్రియకు మూడేళ్ళ క్రితం వివాహమైంది. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఉదయమే లేచి ఇంటిపనులు చేయకుండా నిద్రపోతుందని భర్త మందలించాడు. ఇదే విషయంపై ఆమె తల్లిదండ్రులు సైతం మందలించారు. తీవ్ర మనస్తాపంతో హర్షప్రియ శనివారం రాత్రి తన కుమారుడిని తీసుకుని ఇంటినుంచి బయటకు వెళ్ళిపోయింది. తిరిగి ఇంటికి రాకపోయేసరికి భర్త, బంధువుల పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త ఏలూరు టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు



గుర్వాయిగూడెం మద్ది క్షేత్రం




మద్ది ఆంజనేయస్వామి



మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 22 నుంచి వచ్చే నెల 21 వరకు మద్ది క్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాలు వార్షిక సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. 22న ప్రభాత సేవ, నిత్యార్చన, గోపూజ, కార్తీక మాసోత్సవాల ప్రారంభం, 24న సప్తాహ ప్రారంభ పూజా కార్యక్రమాలు, యాగశాల ప్రవేశం తదితర పూజలు, 25న పంచామృతాభిషేకాలు, 26న హనుమద్ హోమం అనంతరం సువర్చల హనుమద్ కల్యాణం, 27న స్వామి గ్రామోత్సవం, స్వామికి తమలపాకులతో వార్షిక లక్షార్చన నిర్వహించనున్నారు. 28న విశేష అష్టోత్తర పూజలు, 29న లక్ష పుష్పార్చన, 30న మద్ది ఆలయ ఉపాలయమైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామికి శాంతి కళ్యాణం, 31న ప్రాతఃకాల అర్చన, మహాపూర్ణాహుతి, నవంబర్ 18న సాయంత్రం స్వామికి పుష్కరిణిలో తెప్పోత్సవం, ఈ నెల 26, వచ్చే నెల 2, 9, 16 తేదీల్లో హనుమద్ హోమాలు, సువర్చల హనుమద్ కల్యాణాలు జరుగుతాయి, ఈ నెల 27, వచ్చే నెల 3, 10, 17 తేదీల్లో స్వామికి లక్ష తమలపాకుల పూజ, ఈ నెల 25, వచ్చే నెల 1, 8, 15 తేదీల్లో స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. ఈ నెల 22, 29, వచ్చే నెల 5, 12, 19 తేదీల్లో స్వామికి విశేష లక్ష పుష్పార్చన జరుగుతాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు



ఈదులగూడెంలో పది అడుగుల మేర తవ్వేసిన దృశ్యం

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో అనుమతి లేకుండా గత పది రోజుల నుంచి తమ పొలంలోని గ్రావెల్‌ను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యథేచ్ఛగా తవ్వేస్తున్నాడని రైతులు కుప్పాల శేషగిరి, ముల్లంగి జోజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రోజులు నుంచి తమ పక్కనే ఉన్న పొలంలో ప్రభుత్వం అనుమతిలేకుండా టీడీపీ నేత గ్రావెల్, మట్టిని తవ్వి లారీలలో బయటకు తరలిస్తున్నాడు. ఆ రైతు పొలానికి పక్కనే ఉన్న తమ పొలంలో కూడా పది రోజుల నుంచి దాదాపు పది అడుగుల లోతు తవ్వి మట్టిని లారీలలో తరలిస్తున్నాడని తెలిపారు. ఇదేంటని బాధితులు ప్రశ్నించగా బెదిరింపులు పాల్పడుతున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీఆర్‌ఏ, అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు

పెద్దింట్లమ్మా.. రక్షించమ్మా



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తుల రద్దీ

కైకలూరు: అమ్మా.. కొల్లేటికోట పెద్దింట్లమ్మా.. నీ చల్లని ఆశీస్సులతో మమ్ములను రక్షించమ్మా.. అంటూ భక్తులు ఆర్తితో వేడుకున్నారు. జోరున వర్షం కురుస్తున్నా సమీప జిల్లాల నుంచి ఆదివారం భక్తులు కొల్లేటికోటలో అమ్మను దర్శించుకున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి, అమ్మకు పొంగళ్లు, వేడి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున రూ.40,877 ఆదాయం వచ్చిందని చెప్పారు.

అక్రమ కలప లోడు ట్రాక్టర్ సీజ్



అప్పారావుపేట వద్ద కలపను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా కలపను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని అప్పారావుపేట జంక్షన్ వద్ద ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కలపను కోరుమామిడి నుంచి పట్టింపాలెంకు తరలిస్తున్నట్లు తెలిసింది. నీలాద్రిపురం గ్రామానికి చెందిన రైతు తోటలో మరో తొమ్మిది దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై ఫారెస్ట్ అధికారిని ఆదివారం వివరణ కోరగా, మొత్తం 20 దుంగల విలువ రూ.లక్ష ఉంటుందని అంచన వేస్తున్నట్లు తెలిపారు. కలప పట్టింపాలెంకు చెందిన కంకిపాటి గన్నియ్యకు చెందినదిగా గుర్తించామన్నారు. కలపను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నేతలకు అనుబంధ విభాగాల్లో పదవులు కేటాయిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కైకలూరు నియోజకవర్గానికి చెందిన నిలపాల వెంకటేశ్వరరావును ఏలూరు జిల్లా రైతు విభాగం కార్యదర్శిగా నియమించారు. బండి విష్ణువర్ధన్ రావును జిల్లా బూత్ కమిటీ వింగ్ కార్యదర్శిగా, బొబ్బిలి రత్తయ్య నాయుడును జిల్లా పబ్లిసిటీ వింగ్ కార్యదర్శిగా, బుర్ల కృష్ణంరాజు (కిరణ్)ను జిల్లా ఆర్‌టీఐ వింగ్ కార్యదర్శిగా, ఈదా మురళీకృష్ణను జిల్లా పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శిగా నియమించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: వన్‌టౌన్ ప్రాంతంలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వంగాయగూడెం ప్రాంతానికి చెందిన గుడిపూడి చంద్రమౌళి (32) సెంట్రింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చంద్రమౌళి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మద్యం తాగకుండా నెలరోజుల నుంచి కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో అతను ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద విద్యుత్ వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు ఉచిత వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం మాట్లాడుతూ చంద్రబాబు బినామీలకు వైద్య కళాశాలలను కట్టబెట్టడం సరికాదన్నారు. రాష్ట్రంలో నాసి రకం మద్యం బ్రాండ్లు అమ్ముతూ ప్రజల ఆరోగ్యాలతో ప్రస్తుత ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. నిర్భయంగా వార్తలు రాస్తున్న సాక్షి యాజమాన్యంపైనా, విలేకర్లపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని మంగరాజు డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

అత్తిలి: అత్తిలి మండలం పాలూరు గ్రామానికి చెందిన శరకడం అప్పల సత్య సూర్యనారాయణ(65) ఆరవల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు వివరాల ప్రకారం సూర్యనారాయణ లక్ష్మీనారాయణపురంలో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా ఆరవల్లి వైఎస్సార్ కాలనీ సమీపంలో ఆటో ఢీకొంది. దీంతో అతని తలకు గాయమైంది. ప్రమాదం వివరాలు తెలుసుకున్న కుమారుడు అతన్ని తణుకులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఒక వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నెహ్రూ కాలనీ 9వ రోడ్డుకు చెందిన ముని దుర్గాప్రసాద్ (49)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని దిగమర్ర గ్రామానికి చెందిన పెచ్చెట్టి ఆంజనేయులు (52) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి దిగమర్రు నుంచి చించినాడ వెళ్తున్న ఆంజనేయులను వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన ఆంజనేయులును స్థానికులు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన సంజీవరావు

ఆకివీడు: మండలంలోని మందపాడు శివారు పెద ఉప్పరగూడెంలోని రొయ్యల చెరువుపై పనిచేస్తున్న భూటారి సంజీవరావు(45) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు ఆదివారం చెప్పారు. గ్రామంలోని పెరుమాళ్ల పెద వెంకటేశ్వరరావు చెరువుపై పనిచేస్తున్న సంజీవరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు వాసి అని తెలిపారు. అతని సోదరుడు దేవా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనుగొండ: ములపర్రు శివారు పితానివారి పాలెంకు చెందిన జక్కంశెట్టి సతీష్(24) అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని పెనుగొండ ఎస్సై కే గంగాధర్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి యాక్టివాపై వెళ్లిపోయినట్లు సోదరుడు వినోద్‌కుమార్ ఫిర్యాదు చేసినట్లు వివరించారు. మోటార్ సైకిల్ దొంగరావిపాలెం బ్రిడ్జి వద్ద పార్కు చేసిఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెదికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. గోదావరిలో దూకారన్న అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న గుంతల రోడ్లు



పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిపై ప్రయాణికుల పాట్లు



కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద దెబ్బతిన్న రోడ్డు

కైకలూరు: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది కైకలూరు నియోజకవర్గ పరిస్థితి. ఆక్వా ఉత్పత్తులతో ఆదాయంలో అగ్రస్థానంలో ఉన్నా రోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే రహదారులు తటాకాలుగా కనిపిస్తున్నాయి. రోడ్డు ఏదో, గుంత ఎక్కడుందో గుర్తించలేని పరిస్థితి. పామర్రు–దిగమర్రు 216 జాతీయ రహదారిలో గుంతల సమస్య జఠిలమవుతోంది. జాతీయ రహదారి విస్తరణ పనులు ఆలస్యం అవుతున్నాయి. వీటి నిర్మాణాలకు తీసిన గుంతలలో నీరు నిల్వ ఉంటూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

అధిక లోడ్లతో రోడ్లు ఛిద్రం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో చేపల, రొయ్యల సాగు జరుగుతోంది. కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మొత్తం 84,852.4 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. కైకలూరు పరిసర ప్రాంతాల్లో ప్రతి రోజు వందల లారీల ఎగుమతులు ఇతర ప్రాంతాలకు వెళ్తాయి.

ప్రమాదకరంగా పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి



జాతీయ రహదారిపై కైకలూరు టౌన్ హాలు వద్ద తటాకంలా రోడ్డు

10 చక్రాల లారీ సరుకుతో కలిపి 25 టన్నులు, 12 చక్రాల లారీ 30 టన్నుల బరువు ఉంటుంది. కూటమి పాలనలో అక్రమ మైనింగ్ టిప్పర్లు నిత్యం తిరుగుతున్నాయి. కైకలూరు ప్రాంతంలో హైవే పనులకు మట్టి అవసరం కావడంతో అధిక లోడ్లతో టిప్పర్లు రహదారులను పాడుచేస్తున్నాయి.

గుడివాడ, ఏలూరు వంటి ప్రాంతాల నుంచి కైకలూరు మీదుగా భీమవరం వెళ్ళే వాహదారులు ఇదేం కర్మరా బాబూ! అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ వద్ద భారీ గుంతలు భయపెడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌లో గుంతల కారణంగా ప్రయాణికులు, బస్సు డ్రైవర్లు నానా తిప్పలు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వర్షపు నీరు చేరుతుంది. టౌన్‌హాలు వద్ద వర్షం కురిస్తే పెద్ద కాల్వలా రోడ్డు మారుతుంది.

దీపావళిని తాకిన ధరాఘాతం



పువ్వుల దుకాణం



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: దీపావళి పండగకు ఈ ఏడాది ధరాఘాతం తప్పలేదు. పూజా సామగ్రి ధరలన్నీ ఆకాశాన్నంటాయి. చామంతి, బంతి పువ్వులు పావు కిలో రూ.70, తామర పువ్వు ఒక్కటీ రూ.30, కొబ్బరికాయలు రూ.25 నుంచి రూ.30, ప్రమిదలు డజను సాదా రూ.30 నుంచి రూ.50, డిజైన్ ప్రమిదలు రూ.40 నుంచి రూ.60 విక్రయించారు. సాధారణ రోజులతో పోలిస్తే ధరలు భారీగా పెరిగాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం పట్టణం సందడిగా కనిపించింది. ప్రమిదలు, పువ్వుల షాపులు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. ఏడాదికో సారి వచ్చే పండగ కావడంతో ధరలు పెరిగినా స్తోమతలో పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో 42.4 మిల్లీ మీటర్లు, పెంటపాడులో 16.8 మిల్లీ మీటర్లు నమోదైంది. కాగా ఆదివారం ఉదయం తుంపర వర్షం కురవగా, మధ్యాహ్నం నుంచి తెరిపిని వ్వడంతో దీపావళి బాణసంచా వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

గూడెం అభివృద్ధికి 'కొట్టు' కృషి



తాడేపల్లిగూడెం అర్బన్: కొట్టు సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బాలరాజేష్

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి కొట్టు సత్యనారాయణ కృషి ఎనలేనిదని వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెల్లడించాయి. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలను స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మాజీ మంత్రి కొట్టు పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ట్రాఫిక్ సమస్యకు రెండో ఫ్లైఓవర్ నిర్మాణం, హార్టీకల్చర్ యూనివర్శిటీ, నన్నయ్య యూనివర్శిటీ కాంపస్, నియోజవర్గంలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు పట్టణంలోనూ, గ్రామాల్లోనూ ఇప్పటి వరకు సుమారు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఆయన ఉపముఖ్యమంత్రిగా మంజూరు చేయించిన అభివృద్ధి పనులే కొనసాగుతున్నాయన్నారు. కొట్టు సత్యనారాయణ దైవ దర్శనానికి వెళ్లడంతో వేడుకలను ఆయన కుమారుడు బాలరాజేష్ చేతుల మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్ కుమార్, జడ్డు హరిబాబు, కర్నాటి కన్నయ్య, వట్టి బుజ్జి, శిరిగినీడి విజయకృష్ణ, అరిగెల అభిషేక్, బొద్దాని శ్రీనివాస్, పత్సమట్ల సావిత్రి, పొట్ల ఏడుకొండలు, గార్లపాటి వీరకుమార్, కొరపాటి వెంకటేశ్వరరావు, షేక్‌నొషద్, నీలం భూషణం, సిర్రాపుశాంతకుమార్, కనుపూరి భాస్వరాచార్యులు, ఆరిమిల్లి రవి, చామన సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పేదలకు దుప్పట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో ఆదివారం రాత్రి పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు తారమట్ల శ్రీనివాస్, గంధం బాబి, నరాల బోజియ్యా, కుమ్మర పురుగు ఏసు, వెంపల భద్రరావు, ప్రత్తి రాజాబాబు, గరగ ఏసు, ప్రత్తి రంగయ్య, గోపిశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు



దీక్షలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి బస్టాండ్ బయట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 6వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఆదివారం ఆర్టీసీ కార్మికు లు మాట్లాడుతూ పనిభారంతో కూడిన రెస్టాఫ్ డ్యూటీలు, కిలోమీటర్లు తగ్గించమని, ఇన్‌కమింగ్ టైంకూడా తగ్గించమని, డ్రైవర్ జి.రా మారావు అక్రమ సస్పెండ్‌ను ఎత్తివేయా లని నినాదాలుచేశారు. డ్రైవర్లు సీహెచ్‌జే కుమార్, ఎంఎస్ నారాయణ, ప్రసాద్, కండక్టర్ టి.శ్రీను, మెకానిక్ పీఎస్ బాబు పాల్గొన్నారని డిపో అధ్యక్షుడు సరిదే ఏసుబాబు, కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పెంటపాడు: పెంటపాడు మండలంలో పెంటపాడు, కె.పెంటపాడు గ్రామాల మధ్యలో పేకాట స్థావరాలపై పెంటపాడు పోలీసులు ఆదివారం దాడులు చేశారు. దీపావళి పురస్కరించుకొని పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,200 నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. కాగా ఈ కేసులో అధికార పార్టీ నాయకులు ఉన్నట్లు సమాచారం. దీంతో కేసు నమోదు చేసేందుకు, ఈ వివరాలను చెప్పేందుకు పోలీసులు తాత్సారం చేశారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని వ్యవసాయ అధికారి కానూరి పార్థసారథి అన్నారు. కడకట్ల జనత ఆసుపత్రి ఆవరణలో క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 82 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. 11 మంది రోగులను మైనర్ ప్రొసీడింగ్స్ నిమిత్తం, 17 మంది ఆపరేషన్ల నిమిత్తం నిడదవోలు కంటి ఆసుపత్రికి తరలించారు. జనతా ఆసుపత్రి వైద్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, అధ్యక్షుడు చిన్నం మణీంద్ర, సెక్రటరీ త్రిమూర్తులు, సుంకర శ్రీనివాస్, డాక్టర్ పృథ్వీరాజ్, మదన్మోహన్ అగర్వాల్, డీవీపీ విశ్వేశ్వరరావు, బాపయ్య శర్మ, ఆలపాటి పవన్ కుమార్ రాజా త్రినాథ్, చిక్క వెంకటేశ్వరరావు, జగదీష్, సంపత్‌లు సేవలు అందించారు.

యాత్రా బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక క్షేత్ర దర్శిని ప్రత్యేక బస్సు యాత్రలను ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం దానమ్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పంచారామ క్షేత్ర దర్శనానికి, అరుణాచల గిరి ప్రదిక్షణ దర్శిని, జనార్ధన క్షేత్రాలు, భద్రాచలం దర్శనం, ఏకాదశి రుద్రుల దర్శిని, శివ కేశవ దర్శిని, శబరిమాలై యాత్రలకు ప్రత్యేక బస్సులు తాడేపల్లిగూడెం డిపో నుంచి వివిధ రోజులలో తరలి వెళ్ళతాయని ఆమె తెలిపారు. అందుబాటు ధరలకు యాత్రలు ఉంటాయని వెల్లడించారు. మరన్ని వివరాలకు ఆర్టీసీ డీఎం కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

విద్యార్థి దశ నుంచి పుస్తకాలు చదవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జ్ఞాన సమపార్జనకు విద్యార్థి దశ నుంచి పుస్తకాలు చదవాలని, గ్రంథాలయా న్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవా లని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో అధికారి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఉయ్ లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ వైద్య శాస్త్రానికి తొలి గురువు ధన్వంతరి జయంతిని ధన త్రయోదశిగా నిర్వహించారు. వక్తలు గరికపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ ప్రపంచంలోని జనులు ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ఈవీఎం పాఠశాల విద్యార్థులు, రీడర్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్ద వైద్య సేవలు



వృద్ధుడికి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వైద్య సేవలందించారు. ప్రత్యేక వాహనంలో తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లోని ఆరుగురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. సభ్యులు గోదావరి మాణిక్యాలరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కడప జిల్లా కార్మిక నేతలకు కృతజ్ఞతలు



ఏఐటీయూసీ నేతలతో కుంచనపల్లి గ్రామస్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు హాజరైన కడప జిల్లా కార్మిక నేతలకు తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామస్తులు ఆదివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కృతజ్ఞతలు తెలిపారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దేబరిక సురేష్ రాడ్ బెండింగ్ పనుల కోసం కడప జిల్లా పోరుమామిళ్ల సమీపంలోని ఒక గ్రామానికి వెళ్లగా అక్కడ ఆయన పాము కాటుకు గురయ్యారు. సురేష్‌ను ఆసుపత్రికి తీసుకెళుతుండగా దారిలోనే మృతి చెందారు. మృతి చెందిన విషయంను తెలుసుకున్న తాడేపల్లిగూడేనికి చెందిన ఏఐటీయూసీ నాయకులు డి.సోమసుందర్, పోలిరాతి ఆదినారాయణలు కడప జిల్లాకు చెందిన ఏఐటీయూసీ నాయకులు ఎల్.నాగసుబ్బారెడ్డి, మద్దిలేటి, పి.మస్తాన్‌లకు విషయాన్ని తెలిపా రు. అక్కడ ఏఐటీయూసీ నాయకులు సురేష్ శవ పంచనామా, మృతదేహాన్ని తాడేపల్లిగూడేనికి తరలించడం, కాంట్రాక్టర్ నుంచి కార్మికుని కుటుంబానికి పరిహారం ఇప్పించేందుకు అండగా నిలిచారు. ఏఐటీయూసీ కౌన్సి ల్ సమావేశాలకు కడప జిల్లా నాయకులు తాడేపల్లిగూడెం రాగా వారికి కుంచనపల్లి గ్రామస్తులు చుక్క నాని, యోనా, గవరయ్య, శ్రీను, సంజయ్, బాబీ, పండు, నాగబాబు, శివ, చిన్న, రాజు, రాజేష్, ప్రభు, బి.శ్రీను, తాడేపల్లి రాజు, ఎం.శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.